1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

శనివారం | అక్టోబర్ 19, 2024 | www.navatelangana.com

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలో గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా బేల మండలం సహెజ్ తండాకు చెందిన జాదవ్ భీంరావు(31) ఏఎస్ఆర్ఎఫ్(అగ్రికల్చర్ సీనియర్ రీసెర్చ్ అధికారి)గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం రాత్రి ఆయనకు తెలిసిన వ్యక్తి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అద్దెకుంటున్న రూమ్ వద్దకు వచ్చి చూశాడు. భీంరావు మృతి చెంది ఉండడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతిపై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మృతుని తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తాంసి

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వడ్డాడి ప్రాజెక్ట్ పరిసర ప్రాంతంలో జరిగింది. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన హరిక్రిష్ణ(27) కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయాడు. ప్రాజెక్టు పరిసరాల్లో పురుగులమందు తాగాడు. అటుగా వెళుతున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శివరాం సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. మూడు సంవత్సరాల క్రితం మృతుడి అన్న కూడా ఇదే ప్రాంతంలో ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పత్తి కొనుగోళ్లు ఎప్పుడు..?

- ఆతృతగా ఎదురుచూస్తున్న అన్నదాతలు
- అధిక మొత్తంలో ఇండ్లలో నిల్వ చేసుకోలేక తంటాలు
- ప్రారంభంపై తాత్సారంతో రైతుల్లో నిరుత్సాహం
- తేదీ ఖరారుపై స్పష్టత ఇవ్వలేకపోతున్న అధికారులు

జిల్లాలో పత్తి కొనుగోళ్లకు ఇంకా ముహూర్తం ఖరారు కావడం లేదు. ఇప్పటికే మొదలుకావాల్సిన కొనుగోళ్ల ప్రక్రియ వివిధ కారణాలతో ఆలస్యమవుతోంది. ఇప్పటికే రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించిన అధికారులు కొనుగోళ్ల తేదీని ఖరారు చేయలేదు. దీంతో కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభమవుతాయని అన్నదాతలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది పత్తి పంట ఇంటికొచ్చినా మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు అవకాశం లభించకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇరుకు ఇండ్లలో అధిక మొత్తంలో పత్తి నిల్వ చేసుకోలేక తంటాలు పడుతున్నారు. వివిధ కారణాలు చెబుతూ అధికారులు తాత్సారం చేయడం మూలంగా అన్నదాతలు అవస్థలు పడాల్సి వస్తోంది. కొనుగోళ్లు ప్రారంభించాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినప్పటికీ ఇంకా తేదీ ఖరారు కాకపోవడం విమర్శలకు తావిస్తోంది.





నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన పంటగా భావించే పత్తి ఇప్పటికే ఇంటికి చేరింది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని పండించిన పంటను మార్కెట్‌కు తీసుకొద్దామని ఆశపడిన అన్నదాతలకు అధికారుల వైఖరితో కష్టాలు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పత్తి పంట ఇంటికి వచ్చి సుమారు 20రోజులు గడుస్తున్నా మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభం కావడం లేదు. కొత్త పత్తిని అమ్ముకొని ప్రయోజనం పొందడమే కాకుండా అప్పులు తీర్చాలని భావిస్తున్న అన్నదాతలకు అధికారుల తీరుతో అవస్థలు పడాల్సి వస్తోంది. ఇంటికి చేరిన పంటను రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరుబయట ఆరబెట్టడం.. సాయంత్రం కాగానే మళ్లీ ఇంట్లో నిల్వ చేసుకుంటున్నారు. అనేక మంది రైతులకు ఇరుకు ఇండ్లు ఉండటంతో ఎక్కువ రోజుల పాటు నిల్వ చేసుకోవడం వారికి ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. క్వింటాళ్ల కొద్దీ పత్తి ఇంట్లో నిల్వ చేసుకోవడం వారికి కష్టంగా మారుతోంది. మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభమైతే విక్రయిద్దామని ఆలోచనలో ఉన్నప్పటికీ అధికారులు ఇంకా ప్రారంభం చేయకపోవడంతో అసంతృప్తికి గురవుతున్నారు. ముఖ్యంగా కొన్ని రకమైన నేలల్లో పత్తి పంట ముందస్తుగానే రావడం..మరికొన్నింటిలో ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. పంట ఇంటికొచ్చిన రైతులు మాత్రం మార్కెట్ ఎప్పుడు మొదలైన వెంటనే తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు.

జిల్లాలో 32.47లక్షలు టార్గెట్..!

ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 4,33,317 ఎకరాల్లో పత్తి పంటను పండించారు. జిల్లాలో మొత్తం పంటల విస్తీర్ణంలో ఈ పంటనే అధికంగా ఉంటుంది. అనేక మంది రైతులు పత్తిపై ఆధారపడి పంటలు పండిస్తున్నారు. రైతుల జీవనాధారమైన ఈ పంటకు మద్దతు ధరతో పాటు గిట్టుబాటు ధర కూడా దక్కాలని రైతులు ఆశపడుతుంటారు. కిందటేడాది పత్తికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7020 ఉండగా ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.500 పెంచిన ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.7521గా నిర్ణయించింది. ఇక్కడి పత్తికి అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉండటంతో గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశిస్తున్నారు. కిందటేడాది జిల్లాలో 20.28లక్షల క్వింటాల్‌ల పత్తి పంట మార్కెట్‌కు రాగా కేంద్రప్రభుత్వ రంగ సంస్థ అయిన భారత పత్తి సంస్థ(సీసీఐ) 15.73లక్షల క్వింటాల్‌లు కొనుగోలు చేయగా.. ప్రయివేటు వ్యాపారులు 4.55లక్షల క్వింటాల్‌లు కొనుగోళు చేశారు. ఈ ఏడాది 32.47లక్షల క్వింటాల్‌ల వరకు పత్తి పంట మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా తేమపై పేచీ నెలకొనడం ప్రతి ఏటా రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలి : స్వామి, రైతు, యాపల్‌గూడ



ఈ ఏడాది 25 ఎకరాల్లో పత్తి పంట వేశాను. ఇప్పటికే 20క్వింటాల్‌ల వరకు పంట ఇంటికొచ్చింది. పెద్ద మొత్తంలో ఇంట్లో నిల్వ చేసుకోవడం ఇబ్బందిగా ఉంది. అధికారులు వెంటనే కొనుగోళ్లు ప్రారంభిస్తే విక్రయించడానికి అవకాశం ఉంటుంది. అధికారులు మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభించేలా నిర్ణయం తీసుకోవాలి.

త్వరలోనే కొనుగోళ్లు ప్రారంభం : గజానన్, మార్కెటింగ్ ఏడీ, ఆదిలాబాద్



జిల్లాలో త్వరలోనే పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. దీనికి సంబంధించి ఉన్నతాధికారులు ఇప్పటికే వ్యాపారులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. మరోపక్క మార్కెట్‌లో ఇప్పటికే కాంటాలు, కంప్యూటర్లు సిద్ధం చేశాం. రైతులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులో ఉంచుతాం. వారం రోజుల్లోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రతి ఉపాధ్యాయుడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని పిఆర్టియుటిఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాలలో పిఆర్టియు టిఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి నెలలో జరుగుతాయన్నారు. నవంబర్ 2018 నుండి నవంబర్ 2024 మధ్యలో కనీసం మూడు సంవత్సరాల ఉన్నత పాఠశాల సర్వీస్ కలిగిన ఉపాధ్యాయులు ఓటు హక్కుకు అర్హత కలిగి ఉంటారన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు నవంబర్ 11 లోపు ఫామ్ నెంబర్ 19 నింపి సర్వీస్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జత చేసి తహసీల్దార్ కార్యాలయంలో అందించి రిసిప్ట్ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన పిఆర్సీ, పెండింగ్ డీఏల సాధన, గిరిజన సంక్షేమ శాఖ, సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు మినిమం టైమ్స్ స్కేల్, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 317 జీవో ద్వారా బాధిత ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు పంపించడం కొరకు కృషి చేసామని తెలిపారు. మార్చి 2025లో జరిగే శాసనమండలి ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సునార్కర్ అనిల్ కుమార్, ఉప్పుల నరసింహాచారి, తంగడిపల్లి రాకేష్, జాడి దేవాజీ, వేణుగోపాలరావు, చంద్రశేఖర్, సునీత, వరలక్ష్మి, అనురాధ, శ్రీలత, సమత, రవిశంకర్, దెబ్బటి సత్యనారాయణ, ఎనగంటి భిక్షపతి, శ్రావణ్ పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 27న జరిగే ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగేష్, ఆరిఫా తెలిపారు. శుక్రవారం సుందరయ్య భవనంలో మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహాసభలకు 24న హైదరాబాద్‌కు తరలివెళ్తామన్నారు. 25న రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ఇందిరాచౌక్‌లో మహా ధర్నా ఉంటుందన్నారు. మరుసటి రోజు 26న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో సమావేశం, 27న రాష్ట్ర మహాసభలు ఉంటాయని వెల్లడించారు. వికలాంగుల సంఘం ప్రతినిధులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కుమ్ర శత్రుఘన్, జిల్లా ఉపాధ్యక్షులు వజ్రాల పొచ్చన్న, జిల్లా కోశాధికారి అనసూయ, జిల్లా కమిటీ సభ్యులు మస్రత్ బేగం పాల్గొన్నారు.


వీసీని కలిసిన నాన్ టీచింగ్ ఉద్యోగులు



నవతెలంగాణ-ముధోల్

ఆర్జీయూకేటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు ట్రిపుల్ ఐటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోవర్ధన్‌ను శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. పరిపాలన, అకాడమిక్‌పై పట్టు, సమర్థత ఉన్న వ్యక్తిని వీసీగా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ధరావత్ శ్యాంబాబు, ఉపాధ్యక్షులు డాక్టర్ కొండ అరుణజ్యోతి, ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి, సహా కార్యదర్శి అజయ్, ఈసీ నెంబర్ శరత్, రాజు, వర్మ శీను, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-సారంగాపూర్

పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిపిఒ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాఠశాలకు డస్టు బిన్‌లను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు చెత్త కాగితాలు ఎక్కడంటే అక్కడ పడేయకుండా డస్టు బిన్‌లోనే వేసి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గణేష్, ఎంపీఓ అజీజ్‌ఖాన్, కార్యదర్శి గోపీకృష్ణ పాల్గొన్నారు.

పత్తిని ఆరబెట్టాకే కేంద్రాలకు తేవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తెచ్చేటప్పుడు ఆరబెట్టి తేవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి తేమ శాతం నిర్ధారణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పత్తి తేమ శాతం నిర్ధారణపై శిక్షణ కార్యక్రమంలో ఐకెపి, మార్కెట్ కమిటీ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. తేమ శాతాన్ని నిర్ధారించే మిషన్‌తో మూడు రకాల పత్తి(ఒకటి కుప్పలుగా వేసిన పత్తి, రెండు ఉదయం 6గంటల నుండి 9గంటల వరకు, మూడు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు సేకరించిన)ని మూడు విభాగాలుగా మిషన్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పత్తిని 8శాతం తేమ మించకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, ఇంటివద్ద నుండి తెచ్చేటప్పుడు పత్తిని ఆరబెట్టి తేవాలని సూచించారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల సమయంలో సేకరించిన పత్తి తేమ శాతం తక్కువగా ఉంటుందని, మరుసటి రోజు కొనుగోలు కేంద్రాలకు తెచ్చేటప్పుడు ఇంటివద్ద ఆరబెట్టి తీసుకొస్తే తేమ లేకుండా ఉంటుందన్నారు. మిగతా రెండు రకాలు కుప్పలుగా పోసి రెండు, మూడు రోజులైన పత్తి, అలాగే ఉదయం 6గంటల నుండి 9గంటల వరకు సేకరించిన పత్తి మరుసటి రోజు కేంద్రాలకు తేవడం జరుగుతుందన్నారు. దీంతో తేమ శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. సిబ్బంది మిషన్ పత్తి నిర్ధారణపై అవగాహన కలిగి ఉండాలని, కోనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులందరూ ఒకేసారి కాకుండా దశల వారిగా కేంద్రాలకు పత్తిని తేవాలని, పత్తి పూర్తిగా ఆరిన తరువాతనే అమ్మకానికి తేవాలని, నీళ్ల చల్లిన పత్తిని సీసీఐ కొనుగోలు చేయదని తెలిపారు. పత్తికి కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7521 నిర్ణయించడం జరిగిందని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది తేమ శాతం నిర్ధారణపై క్షేత్ర స్థాయిలో పూర్తి అవగాహన చేసుకొని, కోనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా వచ్చే 150 రోజుల పాటు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి గజానన్, ఐకేపీ, సీసీఐ, సిబ్బంది ఉన్నారు.

రౌడీ వ్యవస్థను అంతం చేస్తా

- ఇప్పటి నుండి ధర్మానికి అధర్మానికి మధ్య యుద్ధం
- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు



నవతెలంగాణ-మంచిర్యాల

నియోజకవర్గంలో రౌడీయిజం, గూండాగిరి, గంజాయి స్మగ్లింగ్ లేకుండా చేస్తానని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. శుక్రవారం నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బిఆర్ఎస్, బీజేపీ నాయకులు రౌడీయిజానికి మారుపేరని తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో నియోజకవర్గంలో రౌడీయిజం పెరిగిపోయిందని ఆరోపించారు. 2016కు ముందు రికార్డులు తీపిస్తామని అప్పటి ఎమ్మెల్యే కొడుకు విజిత్‌రావు చేసిన అరాచకాలు ప్రజలకు తెలిసేలా చేస్తామన్నారు. పోలీసులను పావుగా వాడుకొని విజిత్ రౌడీయిజం, గూండాయిజాన్ని నియోజకవర్గంలో ఉసిగొల్పడాన్ని ఎద్దేవా చేశారు. పోలీస్‌స్టేషన్‌స్ సెటిలెమెంట్‌లకు కేంద్రంగా బిఆర్ఎస్ నాయకులు వినియోగించుకున్నారని మండిపడ్డారు. గడప రాకేష్ తన జిమ్‌లో రౌడీలను, గూండాలను పెంచి పోషిస్తూ వారితో అసాంఘిక కార్యకలాపాలు చేయించేవాడని తెలిపారు. ఇప్పటి నుండి ధర్మానికి అధర్మానికి యుద్ధం మొదలైందని, జిల్లాలో రౌడీయిజం, డ్రగ్స్ మాఫియా, గూండాయిజాన్ని అంతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. ఇటీవల పలువురు బిఆర్ఎస్ గూండాలపై కేసులు నమోదైనందున కాంగ్రెస్ నాయకుడు జగన్‌మోహన్‌రావుతో పాటు తన ఇంటిపై దాడికి యత్నించారని రుజువు చేశారు. చట్టాన్ని అతిక్రమించి ఎవరు ప్రవర్తించినా కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా జిల్లా ప్రజల సౌకర్యార్థం ఐబి చౌరస్తాలో 650 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తానని పేర్కొన్నారు. దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట్ మండలాల్లో కొత్త రోడ్ల ఏర్పాటుకు రూ.15కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మెన్ రావుల ఉప్పలయ్య, వైస్ ఛైర్మెన్ సళ్ల మహేష్, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్లు బానేష్, సంజీవ్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్ డిమాండ్ చేశారు. కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించరాదని, బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి ప్రభుత్వమే బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం, 1979 వలస కార్మికుల చట్టాలను, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డును రక్షించాలన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించాలన్నారు. బోర్డు నిధులు దుబారా కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోటి రూపాయలపైన వ్యయంతో నిర్మించే నిర్మాణాలపై 2శాతం సెస్సు వసూలు చేయాలని తెలిపారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన లక్ష మోటార్ సైకిళ్లను కార్మికులకు అందించడానికి నిబంధనలు రూపొందించాలన్నారు. ప్రమాద మరణానికి రూ.10లక్షలు, సహజ మరణానికి రూ.5లక్షలు, దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతి, వివాహ కానుకలను రూ.లక్షకు పెంచాలన్నారు. ఖాళీగా ఉన్న ఏఎల్, ఏసీఎల్, డిసిఎల్, జూనియర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రాజెక్టులు, రోడ్లు, పెద్ద పెద్ద కంపెనీలు, ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులు, వలస కార్మికులు అందరినీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బోర్డులో నమోదు చేసి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న వేలాది క్లైమ్స్‌కు వెంటనే నిధులు విడుదల చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాపితంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, అధ్యక్షులు రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి బాలకిషన్, అశోక్, జిల్లా కమిటీ సభ్యులు కమలాకర్, రాములు, రవి, షైక్ గౌస్‌బాబా, మధు, విలాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఫోజులివ్వడం ఐఎన్టీయూసీ నాయకులకు అలవాటే

కాసిపేట : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పరిష్కారమైన సింగరేణి కార్మికుల స్లిప్పుల అంశాన్ని ఐఎన్టీయూసీ నాయకులు సమస్య పరిష్కారమయ్యాక జనరల్ మేనేజర్ కార్యాలయానికి వెళ్లి స్లిప్పుల విధానాన్ని రద్దు చేయాలని, ఆందోళన చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, ఎవరు సాధించినా మేమే సాధించామని చెప్పుకోవడం ఫోటోలకు ఫోజులు ఇవ్వడం ఐఎన్టీయూసీ నాయకులకు అలవాటే అని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ మండిపడ్డారు. మందమర్రి ఏరియాలో కార్మికులు వరుసగా మూడు రోజులు విధులకు గైర్హాజరైతే మైన్ అధికారులు కాకుండా జనరల్ మేనేజర్ అనుమతి తీసుకోవాలని యాజమాన్యం నోటీస్ బోర్డులో పెట్టిందని తెలిపారు. అది సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న సమయంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్‌తో సంప్రదింపులు జరిపామన్నారు. గుర్తింపు కార్మిక సంఘానికి తెలియకుండా ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, పాత పద్ధతిలో ఎలోవ్ స్లిప్పులు చేయాలని కోరామని తెలిపారు. జీఎం స్పందించి ఆ విధానాన్ని వెనక్కి తీసుకున్నారన్నారు. ఈ విషయాన్ని గురువారమే అన్ని గనులపై ఏఐటీయూసీ నాయకులు కార్మికులను కలిసి తెలియజేశారని పేర్కొన్నారు. కాని నిన్న రద్దయిన ఎలోవ్ స్లిప్పుల అంశాన్ని శుక్రవారం ఐఎన్టీయూసీ నాయకులు జీఎం కార్యాలయానికి వెళ్లి ఎలోవ్ స్లిప్పుల విధానాన్ని రద్దు చేయాలని, లేకపోతే ఆందోళన చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | అక్టోబర్ 19, 2024 | www.navatelangana.com

పాఠశాలకు విరాళంగా టీవీ అందజేత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఏమాయికుంట ప్రాథమికోన్నత పాఠశాలకు శుక్రవారం జక్కుల దత్తు టీవీని విరాళంగా అందజేశారు. అదే పాఠశాలలో విధులు నిర్వర్తించే బుక గంగయ్య ఉపాధ్యాయుడు మిత్రుడు ఈ టీవీని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద



పిల్లలకు చదువుతో పాటు ఆన్‌లైన్ పాఠాలు బోధించడంతో వివిధ దృశ్య శ్రవణ కార్యక్రమాలను ఈ టీవీ ద్వారా వీక్షించవచ్చన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మను కుమార్, గ్రామస్తులు విజయ్‌సింగ్, లఖన్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని ధాబా(కె) గ్రామపంచాయతీనీ శుక్రవారం డీఎల్పీఓ ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలించారు. తాగునీటి బావుల్లో క్లోరినేషన్, మురికి కాలువలో చేపడుతున్న సానిటేషన్ పనులను తనిఖీ చేశారు. క్రిమిటోరియా సేంద్రియ ఎరువులు తయారీ, పల్లె ప్రకృతి వనంలో మొక్కలపై ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దని కార్యదర్శికి సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి ఎం. సుభాష్ ఉన్నారు.



తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ



నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లోని బతుకమ్మను సందర్శించారు. నిమజ్జనం సందర్భంగా మహిళలకు రూ.4వేలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కర్మన్‌కర్ బ్రీజ్జులాల్, జేఏసీ మాజీ చైర్మెన్ రాథోడ్ ఉత్తం, మండల పేసా చట్టం చైర్మెన్ రాథోడ్ సికిందర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ షేక్ దాదేఅలీ, తుడుం దెబ్బ నాయకులు మడావి మాన్కు, కాంతారావ్ దుర్గే, అనిల్ నాయక్, చౌహాన్ గోవింద్, ఝాడే విజయ్, ఝాడే శ్యామ్‌రావ్, సావన్, ఝాడే శివ, లాలా, ఝాడే రుక్మా బాయి, తాయిబాయి, ఊర్మిళ, సునీత, తులసి బాయి, జ్యోతి ఉన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

- పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



నవతెలంగాణ-తలమడుగు

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎంహెచ్ఓ కృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న వైద్య సౌకర్యాలను పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణను తెలుసుకున్నారు. మందుల కొరత, డెలివరీ సిబ్బంది సమయపాలన వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగుల రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం డోర్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. గ్రామంలో జ్వరాల బారిన పడిన వారి వివరాలు తెలుసుకున్నారు. వారికి రక్త పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎలాంటి మందుల కొరత ఉందని అడుగగా, సిబ్బంది విరోచనాలకు సంబంధించిన మందులు లేవని డీఎంహెచ్ఓకు తెలిపారు. గ్రామ జనాభా గుర్చి అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి విధుల్లో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిపారు. డీఎంహెచ్ఓ వెంట డాక్టర్ వంశీ, వైద్య సిబ్బంది చిన్నన్న, శ్రీనివాస్, అనిల్, సునీత, మణిలత, నందిని ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని తేజాపూర్ గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రత్యేకాధికారులు తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని సరుకులను, పిల్లల హాజరు, రిజిస్టర్‌లను పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. పిల్లల బరువులను, ఎత్తు, ప్రతినెల చూడాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ప్రతిరోజు పిల్లలకు ఉడకబెట్టిన గుడ్డు అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు రవీందర్, ఎంపీఓ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు, ఎస్.బీమాబాయి, డి.జ్యోతి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తికి సన్మానం



నవతెలంగాణ-బోథ్

బోథ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి హుస్సేన్ బదిలీపై వెళుతున్న సందర్భంగా శుక్రవారం బార్ సోషియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వామన్‌రావ్ దేశ్‌పాండే మాట్లాడుతూ ఎంతో అన్యోన్యంగా ఉంటూ జూనియర్, సీనియర్ న్యాయవాదులకు మార్గదర్శిగా ఉన్నారని అన్నారు. బోథ్ ప్రాంత ప్రజల మన్ననలను పొంది మారుమూల పల్లెలలో న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. విధి నిర్వహణలో భాగంగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారు ఎక్కడున్నా ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో సుఖంగా ఉంటూ వారు భవిష్యత్తులో మరెన్నో పదవులు స్వీకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీపీ శ్రీధర్, ఏజీపీ పంద్రం శంకర్, న్యాయవాదులు సుభాష్, మోహన్‌రావ్, అంగద్ కేంద్రే, రూపేందర్ సింగ్, హరీశ్, విజయ్, దమ్మాపాల్, విక్రమ్, జమీర్, శరణ్య సూపరింటెండెంట్ శేఖర్‌రెడ్డి, పీసీలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-కడెం

మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం తెలంగాణ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి కడెం డ్యామ్‌లో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు వందశాతం రాయితీతో చేప పిల్లలను అందిస్తుందన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలిపారు. సబ్బండ వర్గాల అభివృద్దే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందన్నారు. అనంతరం మత్స్యశాఖ రాష్ట్ర చైర్మెన్ మెట్టు సాయికుమార్‌తో పాటు మండల అధికారులతో కలిసి పడవలో ప్రయాణిస్తూ కడెం ప్రాజెక్టును వీక్షించారు. ప్రాజెక్ట్ విశిష్టతను మత్స్యశాఖ చైర్మెన్‌కు తెలియజేశారు. అనంతరం మండలంలోని పెద్దూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు తమ ప్రతి పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దే అమ్మాలని సూచించారు. వరి గ్రేడ్ -ఏ క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ వరి క్వింటాల్‌కు రూ.2,300 ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. రైతులెవరూ దళారులను నమ్మకూడదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దే తమ పంటల అమ్మకాలను చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ సుజాతారెడ్డి, ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, నిర్మల్ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ శైలజ రమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తారి శంకర్, కడెం పట్టణ అధ్యక్షులు వాజీద్ ఖాన్, సింగల్ విండో డైరెక్టర్‌లు గొల్ల వెంకటేష్, పడిగెల భూషణ్, నిర్మల్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దుర్గా భవాని, ఖానాపూర్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రెంకాల శ్రీనివాస్, మండల మైనార్టీ అధ్యక్షులు బబ్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, రహీం, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబంధుకు ప్రమాదం

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కాంగ్రెస్, బీజేపీ నాయకులవి అన్ని ఉట్టి మాటలేనని, రైతాంగ సమస్యలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ నాయకులను గ్రామాల్లో నిలదీయాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని యాపల్‌గూడలో బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని మాజీ ఎంపీపీ గండ్రత్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీసీఐ కేంద్ర పరిధిలోని అంశమని దీనిపై ఎంపీ, ఎమ్మెల్యే పాయల శంకర్ పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఈనెల 24న ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతుల పక్షాన చేపడుతున్న నిరసన సభ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా, రైతుకు మద్దతుగా ప్రతి ఒక్కరూ కేటీఆర్ సభ విజయవంత చేయాల్సిందిగా కోరారు. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ తన స్వలాభం కోసం బీజేపీ కండువా కప్పుకొని కాంగ్రెస్ నాయకులతో రెండు నాలుకల ధోరణికి పాల్పడుతున్నారన్నారు. భారతదేశంలోనే నాణ్యత ప్రమాణాల్లో ఎంతో మెరుగైన ఆదిలాబాద్ పత్తి కొనుగోళ్లపై స్థానిక బీజేపీ నాయకులు నోరు మెదపకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. 6 గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, గ్రామాల్లో కరెంటు కోతలు, రైతు బీమా, రైతుబంధు, రుణమాఫీ, ఫసల్ బీమా, రైతులకు అందించకుండా మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపీ ఎన్నికల్లో ఓడిపోతుందన్న సర్వేతో రైతుల ఖాతాల డబ్బులు జమ చేసిన విధంగానే నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా ఎందుకు రైతులకు అందించలేకపోతుందని ప్రశ్నించారు. 50 శాతం రైతులకు రుణమాఫీ కాలేదని, రైతులు రోడ్లపైకి ఎక్కి నిరసనలు తెలియజేసినప్పటికీని సీఎం రేవంత్‌రెడ్డి, రైతు రుణమాఫీ అందించడం పూర్తయిందంటూ ప్రధానికి లేఖ రాసి, రైతుబంధుని ఎగగొట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రోకండ్ల రమేష్, విజ్జగిరి నారాయణ, పెందూర్ గంగయ్య, దుర్గం రాంచందర్, జయరాం, మామిళ్ల భూమన్న పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

- నిజామాబాద్ రేంజ్ నార్కోటిక్ డీఎస్పీ సోమనాథన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాదక ద్రవ్యాల సమూల నిర్మూలనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం యాంటి నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేసిందని నిజామాబాద్ రేంజ్ నార్కోటిక్ డీఎస్పీ ఎం.సోమనాథన్ అన్నారు. శుక్రవారం యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో పట్టణంలోని నలంద కళాశాలలో మత్తు పదార్థాల నియంత్రణపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా షీటీం, సైబర్ క్రైమ్ సేవల గురించి, ఆయా విభాగాల సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మత్తు పదార్థాల నియంత్రణపై ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. స్మార్ట్ ఫోన్ వాడకం పెరిగిన నాటి నుంచి విద్యార్థులు, యువత తమకు తెలియకుండానే అపరిచిత లింక్‌లను ఓపెన్ చేస్తూ సైబర్ నేరాల బారిన పడుతున్నారని అన్నారు. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ సిబ్బంది రియాజ్ విద్యార్థులకు వివరించారు.

చెడు వ్యసనాలకు ప్రభావితం కావొద్దు...

ఈ సందర్భంగా నార్కోటిక్ డీఎస్పీ సోమనాథన్ మాట్లాడుతూ చెడు వ్యసనాలు అతి త్వరగా ప్రభావితం చేస్తాయని, అయితే వాటి బారిన పడటం, పడకపోవడమనేది మన స్వీయ నియంత్రణపై ఆధారపడి ఉంటుందని అన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల శరీరం నియంత్రణను కోల్పోయి దాని కోసం ఎంతటి దుర్మార్గానికైనా ఒడిగట్టేలా ప్రేరేపిస్తుందన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు జాతీయ స్థాయిలో నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల చట్టం 1985 యాక్ట్ ఉన్నప్పటికీ, సీఎం రాష్ట్ర స్థాయిలో యాంటీ నార్కోటిక్ బ్యూరో ఏర్పాటు ద్వారా మాదక ద్రవ్యాల నియంత్రణా వ్యవస్థను మరింత పటిష్టం చేశారన్నారు. జిల్లాలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద ఇటీవల 900 క్వింటాళ్ల గంజాయి పట్టుబడటం సంచలనంగా మారిందన్నారు. గంజాయి స్మగ్లర్లకు జీవితఖైదు పడవచ్చని, ఈ అక్రమ దందా ద్వారా వారు సంపాదించిన ఆస్తులను రికవరి చేసుకునే హక్కు చట్టానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, సీఐ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ పున్నారావ్, వైస్ ప్రిన్సిపల్ విజయ్ గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కుట్రలు చేస్తున్న పార్టీలు

- జిల్లాకు చేరిన మాలల చైతన్య బస్సు యాత్ర

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజకీయ ప్రయోజనాలను ఆశించే ఎస్సీ వర్గీకరణను చేపట్టేందుకు పార్టీలు కుట్రలు చేస్తున్నాయని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ కన్వీనర్ జి.చెన్నయ్య ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 14న నల్గొండలో ప్రారంభమైన మాలల చైతన్య బస్సుయాత్ర శుక్రవారం ఆదిలాబాద్‌కు చేరుకుంది. వీరికి జిల్లా మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక అంబేద్కర్ భవన్ నుంచి బైక్ ర్యాలీ ద్వారా అంబేద్కర్‌చౌక్ చేరుకున్నారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఐక్యంగా ఉన్న దళితులను రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం వర్గాలుగా విభజిస్తున్నారని చెన్నయ్య ఆరోపించారు. ఉన్నత న్యాయస్థానం ఎస్సీ వర్గీకరణపై తీర్పులు పరస్పర విరుద్ధమైన తీర్పులు వెలువరించిందన్నారు. మోడీ, చంద్రబాబులు కలిసి కుట్రపన్నారని ఆరోపించారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన మాలల జనాభాను పరిగణలోకి తీసుకోవడం సబాబు కాదన్నారు. బస్సు యాత్ర ద్వారా వర్గీకరణ వల్ల జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ మాలలను చైతన్యపరుస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేసే పార్టీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ నెల 24న చేపట్టే ఛలో హైదరాబాద్‌కు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి కోకన్వీనర్ చెరుకు రాంచందర్, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షుడు యేర సుధీర్, నాయకులు మేకల మల్లన్న, మెట్టు ప్రహ్లాద్, రాజేశ్వర్, అనిల్, రాఘవేందర్ పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పక్షపాతి అని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ నాయకుడు గిమ్మ సంతోష్ అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, చొరవ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి కృషితో నియోజక వర్గానికి వివిధ అభివృద్ధి నిధులు రూ.14కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు. శుక్రవారం పార్టీ కార్యాలయం ప్రజాసేవాభవన్ వద్ద ఇన్‌చార్జి మంత్రి సీతక్క, నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డిల ఫ్లెక్సీలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, బండారి సతీష్, సంద నర్సింగ్, ఇమ్రాన్, జాఫర్ అహ్మద్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, ఎంఎ షకీల్, ఏవన్, మంచాల మల్లయ్య, అంజాద్, జుబేద పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోనీ తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్, ధరణి తదితర రికార్డులు పరిశీలించారు. సమస్యలపై ఆరా తీశారు. కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండటంతో ఇన్‌కమ్, క్యాస్ట్ తదితర ధృవీకరణ పత్రాల జారీ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్యాలయ సిబ్బంది కోరగా, పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరా వినియోగించుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొని రావాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సురేందర్, శకుంతల, సిబ్బంది చందు, రమేష్ ఉన్నారు.

విద్య సాధికారతే లక్ష్యంగా ముందుకు



నవతెలంగాణ-బోథ్

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ప్రభుత్వ పాఠశాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ముందుకు వెళుతుందని మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు రంగారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల ప్రహరీగోడ నిర్మాణ పనులకు భూమి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్‌చార్జి మంత్రి ప్రత్యేకాభివృద్ధి నిధులతో జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో రూ.5లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. మోడల్ పాఠశాలలోను చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించి, కాంట్రాక్టర్‌లను ఏర్పాట్లు. చేయాలని ఆదేశించారు త్వరలోనే సీఎంని కలిసి బోథ్ నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని కోరనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి రూ.10 కోట్లు సీఆర్‌ఆర్ గ్రాంట్‌తో పాటు రూ.4కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడాన్ని పురస్కరించుకుని, బీజేపీ నాయకులు, జైనథ్ మండలం పార్డి గ్రామస్తులు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయనను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. పార్డి(బి), మేడిగూడ కెనాల్ రోడ్డుకు రూ.3 కోట్ల 50 లక్షలు మంజూరు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జైనథ్ మండల బీజేపీ అధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకులు ఆస్తక్ సుభాష్, పోతరాజు, రమేష్, దరంపాల్, గోవర్ధన్, గజానన్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానంద్ అన్నారు. శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యేశించి మాట్లాడారు. బోథ్ మండలంలో కూడా ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు బోరే రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | అక్టోబర్ 19, 2024 | www.navatelangana.com

తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి



తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కమాన గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మస్నే రావూజీ(45) తాగుడుకు బానిసై గురువారం రాత్రి ఇంటిలో ఉన్న వోమిటింగ్ అనే పురుగుల మందు తాగాడు. వెంటనే మృతిని అల్లుడు రాజిట్కర్ నారాయణ కుటుంబసభ్యులతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఏఎస్ఐ ఏఎస్ఐ పోశెట్టి తెలిపారు.

నాలుగు గంటలపాటు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-కెరమెరి

శుక్రవారం మండలం కేంద్రంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 3.30 గంటలనుంచి సుమారు 4 గంటల పాటు విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మీ సేవతో పాటు స్థానిక ఆన్‌లైన్ కేంద్రాలకు జిరాక్స్, ఇతర ఆన్ లైన్ సేవల కోసం చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో మరమత్తుల కారణంగా మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఎలక్ట్రిసిటీ ఏఈ రమేష్ తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయానికి మండల ప్రజలు సహకరించాలని కోరారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ అన్నారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేయనున్న ఆల్ ఫోర్స్ సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మద్దతుగా బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వాంకిడి మండలం బండారలోని డిగ్రీ కళాశాలలో ఉచిత ఎన్రోల్మెంట్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టభద్రులు పూర్తిస్థాయిలో ఓటర్ నమోదు చేసుకోవాలని రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులకు అండగా ఉంటూ ఉద్యోగుల సమస్యల పట్ల పోరాటం చేసే ఉత్తమ నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. ఓటర్ నమోదు కోసం ఫోన్ నెంబర్ 9440070884, 9010785499ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బొట్టుపల్లి సాయి కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య, అధ్యాపకులు విలాస్, మల్లేశం, స్వామి, రామచందర్, కవిత పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని జక్కులపల్లి గ్రామానికి చెందిన మండల రజిత(39) ఈ నెల 12 శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఐబి తాండూర్ సంతకని బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. మహిళకు సంబంధించి బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఆమెకు సంబంధించి సమాచారం తెలిసిన వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ చెంద్రశేఖర్ పేర్కొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం క్రింద విదేశాలలో ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువును పొడిగించినట్టు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాల విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులకు ఈ నెల 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో తెలంగాణఈపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్ కొరియా మొదలగు దేశాలలో ఉన్నత చదువులకు వెళ్ళవచ్చని, ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ముగిసిన పద్మశాలీ సంఘం నామినేషన్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలి సంఘం పట్టణ కార్యవర్గ ఎన్నికల నిర్వహణలో భాగంగా చేపట్టిన నామినేషన్లు శుక్రవారంతో ముగిశాయి. జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు అధ్యక్షతన ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు చెన్నూరు మధుకర్, భోగ మధుకర్, హనుమాన్ల రవీందర్‌లు ఎన్నికల నిర్వహణ ప్రక్రియ నిర్వహిస్తుండగా 27న నిర్వహించే ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యక్ష పదవికి రెండు నామినేషన్లు (అనుమాండ్ల శ్రీకాంత్, కోమటిపల్లి లింగయ్య) రాగా, ప్రధాన కార్యదర్శికి (అల్లే శ్రీకాంత్, జంజిరాల సంజీవ్) రెండు నామినేషన్లు దాఖలు అయినట్లు తెలిపారు. గతంలో ప్రకటించిన ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలు జరగనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుంరం సూరు వర్ధంతి సభ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఉట్నూర్

కొలాం వీరుడు కుంరం సూరు 27వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 25న శుక్రవారం మండలంలోని న్యూకొలాంగూడ, దంతన్‌పల్లిలో జరుపుకునే 27వ వర్ధంతి సభ కార్యక్రమానికి సంబందించిన పోస్టర్లను ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అందరూ విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొలాం సంఘం నాయకులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు వసంత్, కుమ్ర రాజు ఉన్నారు.

మహంకాళి ఆలయాభివృద్ధికి కృషి

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని అతి పురాతనమైన మహంకాళి ఆలయాన్ని ఎమ్మెల్యే పాయల శంకర్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాభివృద్ధి కోసం రూ.25లక్షల నిధులను త్వరలో మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయంలో మహాఅన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు దత్తా నిక్కం, బీజేవైఎం మండలాధ్యక్షుడు పొతరాజ్ నవీన్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు రాము బర్కడే, మండల జనరల్ సెక్రటరీ సందీప్ రాక్రే, మాజీ సర్పంచ్ ఇంద్ర శేఖర్, గణేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్స్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే
- స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

త్వరలో నిర్వహించనున్న గ్రూప్-2, 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. కలెక్టరేట్‌లో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన గదులను అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలు డిసెంబర్ 15, 16, గ్రూప్-3 పరీక్షలు నవంబర్ 17, 18 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని, పరీక్షల సంబంధిత ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 4500 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు వీరి కోసం కాగజ్‌నగర్‌లో 9 కేంద్రాలు ఆసిఫాబాద్‌లో 9 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. అంతకుముందు గ్రూప్స్ పరీక్షలపై టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా అధికారి భానుమతి, ప్రాంతీయ సమన్వయకర్తలు లక్ష్మీ నరసింహ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

వర్ధంతి సభను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జల్ జంగిల్ జమీన్ కోసం పోరాటం చేసి అసువులు బాసిన కుమురంభీం జన్మస్థలం రౌటసంకేపల్లిలో నిర్వహించే కుమురంభీం, ఎడ్ల కొండు వర్ధంతి వేడుకలను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. గిరిజన సంఘాల నాయకులతో శుక్రవారం తన నివాసంలో గిరిజన పోరాట యోధుల వర్ధంతి సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన ప్రాంతాల సమస్యలపై పోరాటం చేసి అసువులు బాసిన ఆదివాసీ పోరాటయోధుల స్మరించుకోవడం తమ కర్తవ్యం అని పేర్కొన్నారు. ఈ నెల 22న నిర్వహించే వేడుకలకు భారీ ఎత్తున ఆదివాసీలు ప్రజలు తరలి రావాలని కోరారు. అనంతరం మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు తన నివాసం వద్ద వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, శ్రీనివాస్, కిష్టయ్య, ఆదివాసీ సంఘం నాయకులు ఆత్రం రాజు, పెందూరు సుధాకర్, సిడాం అర్జున్, మొతిరాం పాల్గొన్నారు.

జైనూర్ ప్రాంతంలో నెట్ పునరుద్ధరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత నెలలో జైనూర్‌లో జరిగిన సంఘటన నేపథ్యంలో నిలిపివేసిన ఇంటర్నెట్ సేవలు తిరిగి పునరుద్ధరించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు టీకానంద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెట్ వర్క్ సేవలు లేకపోవడంతో వివిధ కార్యాలయాలతో పాటు జైనూర్ చుట్టూ మండలాలైన లింగాపూర్, సిర్పూర్(యు), గాదిగూడ, నార్నూర్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటర్నెట్ నిత్యవసర వస్తువుగా మారిందని 45 రోజుల పాటు సేవలు నిలిపివేయడంతో ప్రజలు వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మీసేవ సర్వీసులు ప్రభుత్వ పథకాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకుని వెంటనే సేవలు పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శులు ఆత్మకూరి సతీష్, వడ్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో జిల్లా విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాస్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు హైదరాబాద్‌లో ఎస్సీఈఆర్టీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెస్టివల్ పోటీల్లో మూడవ స్థానం సంపాదించారు. రాష్ట్రస్థాయిలో కృత్రిమ మేధా సమాజం అనే అంశంపై ఎస్సీఈఆర్టీ గోదావరి హాలులో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి విద్యార్థులు పాల్గొనగా జిల్లా విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం ఉదయ్ బాబు, జిల్లా సైన్సు అధికారి కటకం మధుకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గైడ్ ఉపాధ్యాయులు వడ్లూరి రాజేష్ ధర్మపురి వెంకటేశ్వర్లు విద్యార్థులను రాష్ట్రస్థాయికి తీర్చిదిద్దడంలో ఎంతగానో కృషి చేశారని వివరించారు. గైడ్ టీచర్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు గాత్ర గానం, సంగీత వాయిద్యాలు, విజువల్ ఆర్ట్స్, సంప్రదాయ కథలు చెప్పడం, చిత్రలేఖనం, డ్రామా లాంటి ఆరు అంశాలలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కళా ఉత్సవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న కళలను వెలికి తీసే ఉద్దేశంతో కళా ఉత్సవ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అన్ని రకాల పోటీల్లో జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా 6 పాఠశాలల విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. నవంబర్ ఒకటో తేదీన హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.



కళా ఉత్సవ్ విజేతలు వీరే..

గాత్ర గానం- ప్రథమ బహుమతి వైశాలి(కెజీబీవి, రెబ్బెన), ద్వితీయ బహుమతి నందిని(కెజీబీవి, చింతలమానేపల్లి), సంగీత వాయిద్యాలు- ప్రథమ బహుమతి జోయల్(టిజిఎంఎస్, ఆసిఫాబాద్), ద్వితీయ బహుమతి బి. క్షితిజ్ (ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్, కాగజ్‌నగర్), విజువల్ ఆర్ట్స్-ప్రథమ బహుమతి టి.అనూష(కెజీబీవి, రెబ్బెన), ద్వితీయ బహుమతి ఎన్ శ్రావ్య(కెజీబీవి, పెంచికల్‌పేట్), సంప్రదాయ కథలు చెప్పడం-ప్రథమ బహుమతి ఎ.గంగన్న(జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెబ్బెన), ద్వితీయ బహుమతి-కె.లాలస(కెజీబీవి, రెబ్బెన), నృత్య ప్రదర్శన-ఆర్.పౌర్ణమి గ్రూప్(కెజీబీవి, కౌటాల), ద్వితీయ బహుమతి జి.శ్రావణి గ్రూప్(కెజీబీవి, రెబ్బెన), డ్రామా -ప్రథమ బహుమతి జి. శ్రావణి(కెజీబీవి, రెబ్బెన), ద్వితీయ బహుమతి వైష్ణవి అండ్ గ్రూప్(కెజీబీవి రెబ్బెన) నిలిచారు.

మండలానికి చేరుకున్న మాలల బస్సు యాత్ర



నవతెలంగాణ-నేరడిగొండ

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం మండల కేంద్రానికి చేరుకుందని మాల సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షులు మద్దెల నారాయణ స్వామి తెలిపారు. ముందుగా బస్సు యాత్రకు స్వాగతం పలికి అనంతరం మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. నవంబర్ 24న హైదరాబాద్‌లో జరిగే మాలల బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. మాలలు తమ హక్కులను సాధించుకోవాలని అన్నారు. ఈ యాత్రలో మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొప్పుల రమేష్, మేకల మల్లన్న, మండల నాయకులు మద్దెల అడెల్లు, కురుమే నారాయణ స్వామి, సిప్పరి రాజేశ్వర్, విశాల్, నవీన్, లక్ష్మణ్, ఎలుక రాజు ఉన్నారు.

అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా సభ్యుల అరెస్ట్

- 1.5 కేజీల గంజాయి, ఒక వ్యాన్, మూడు సెల్ ఫోన్‌లు స్వాధీనం
- చాకచక్యంగా పట్టుకున్న జిల్లా పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

నలుగురు అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా సభ్యులను అరెస్టు చేసినట్టు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత నెల తలమడుగు పోలీస్ స్టేషన్ పరిధిలో మహారాష్ట్రతో అనుసంధానంగా ఉన్న లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద భారీ ఎత్తున గంజాయి పట్టుబడింది. ఈ సందర్భంలో నిందితులు ఆ కేసులో మిగిలినవారుగా ఉండటం, అదేవిధంగా ఆ గంజాయి తరలించే క్రమంలో వాహనానికి ముందు ఒక వాహనంలో ఉంటూ గంజాయి పోలీసులకు లభ్యం కాకుండా ఫోన్ ద్వారా సంభాషిస్తూ ఉండటం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం పట్టుకున్న నిందితుల్లో ముగ్గురు మహారాష్ట్రలోని బుల్డోన జిల్లాకు చెందిన గోతిరాం గురుదయాల్ సాబ్లే, శుభం గోతిరాం సాబ్లే, అమర్ సింగ్ నారాయణ గోతి, ఇంకొకరు మహారాష్ట్ర జెల్గాన్ జిల్లాకు చెందిన సోమనాథ్ బికా సాబ్లె ఉన్నారు. వీరిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్టు తెలియజేశారు. వీరి వద్ద నుంచి ఒకటిన్నర కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్‌లు, గత నెలలో గంజాయి కేసులో వాహనానికి ముందుండి నడిపిన వ్యానును స్వాధీనం పర్చుకున్నట్టు తెలిపారు. ఆ కేసులో ప్రధాన సూతధారిగా ఉన్న మిగిలిన వారిని కూడా అరెస్టు చేయడానికి ఈ బృందం కార్యచరణను కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కేసులో ముగ్గురు వాహనంలో ఉండగా, ఒకరు గంజాయిని వ్యాపారంగా చేసుకునే వ్యక్తిగా తెలిపారు. అరెస్ట్‌కు ఎంతగానో కృషి చేసిన జైనథ్ సీఐ డి.సాయినాథ్, రూరల్ సీఐ కె.ఫణిధర్, ఎస్సై ముజాహిద్, సిబ్బంది రుక్మారెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాస్, సిబ్బందిని జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ప్రత్యేకంగా అభినందించారు.

కష్టపడ్డ కార్యకర్తలకు ఇందిరమ్మ కమిటీలో స్థానం కల్పించాలి



నవతెలంగాణ-బోథ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీలో పార్టీ కోసం కష్టపడ్డ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఇందిరమ్మ కమిటీలో స్థానం కల్పించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మల్లెపూల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో కొందరు నాయకులు నియోజకవర్గ నాయకులని చెప్పుకుంటూ, కష్టపడ్డ నాయకులను కార్యకర్తలను విస్మరించి ఇందిరమ్మ కమిటీ జాబితాలో వారికి కావాల్సిన వ్యక్తుల పేర్లను అధిష్టానానికి పంపించడం ఎంతవరకు సమంజసమన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తల పరిస్థితి ఆలోచించకుండా, తమ స్వార్థం కోసం కండువాలు మార్చుకున్న వ్యక్తుల పేర్లను పంపించడం సిగ్గుచేటు అన్నారు. కొందరు బీఆర్ఎస్‌లో చేరి కాంగ్రెస్ కండువా కప్పుకోకుండా అటు బీఆర్ఎస్‌కు మద్దతిచ్చి ఇటు కాంగ్రెస్ పేరు చెప్పుకొని తిరుగుతున్న వ్యక్తులకు పార్టీ పగ్గాలను అప్పగిస్తున్నారన్నారు. ఇప్పటి నుంచి కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క దృష్టికి, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ ఇందిరమ్మ కమిటీలో కష్టపడ్డ కార్యకర్తల, నాయకుల పేర్లను జాబితాలో చేర్చాలని లేని పక్షంలో పెద్ద మొత్తంలో విమర్శలు వెల్లువెత్తుతాయని హెచ్చరించారు. సమావేశంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బురుగుల మల్లేష్, నియోజకవర్గ సేవాదళ్ ఇన్‌చార్జ్ సల్ల రవి, నాయకులు పాల్గొన్నారు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులతో నాటక, పాటల ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. సైబర్ నేరాలతో పాటు ఇన్సూరెన్స్, పెన్షన్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారి సాయికృష్ణ, ఐకేపీ సీసీ శౌర, వీఓఏ అమృత, మహిళా సంఘాల సభ్యుడుల పాల్గొన్నారు.

పరస్పరం దాడి చేసుకున్న వారిపై కేసు నమోదు

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని రాపల్లి గ్రామంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పరస్పరం దాడి చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రాపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత భర్త శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తంగెళ్ళ రాజేష్, దేనవేని రాజశేఖర్, సాగర్‌లపై తన కారుతో అడ్డగించి దాడి చేశాడని తెలిపారు. వారికి తీవ్ర గాయాలు కాగా వారు కూడా తిరిగి దాడి చేయడంతో మందపల్లి శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. తన భర్తపై కక్ష పూరితంగా దాడి చేయడమే కాకుండా అక్రమంగా కేసు నమోదు చేశారని మాజీ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత తెలిపారు.

బదిలీపై వెళ్తున్న సివిల్ జడ్జికి సన్మానం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

బదిలీపై వెళ్తున్న సీనియర్ సివిల్ జడ్జికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. లక్షెట్టిపేటలో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న అర్పిత మారంరెడ్డి బదిలీపై జిల్లా న్యాయ సేవల సంస్థల కార్యదర్శిగా మంచిర్యాలకు వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ బదిలీలు సహజమేనని, వృత్తిలో భాగంగా ఉంటాయని కానీ ఎక్కడ పని చేసినా క్రమశిక్షణతో ఉండాలని, మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్, ఏజీపీ వేల్పుల సత్యం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడిగొప్పుల కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, న్యాయవాదులు రాజేశ్వరరావు, కేతిరెడ్డి భూమారెడ్డి, కోమిరెడ్డి సత్తన్న, కారుకూరి సురేందర్, శ్రీధర్, నలినీకాంత్, జి పద్మ ఉమారాణి, సంధ్య పాల్సన్, ప్రకాశం పాల్గొన్నారు.

చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలి

- వ్యవసాయ సహాయ సంచాలకులు బానోత్ ప్రసాద్



నవతెలంగాణ-జైపూర్

గూడ, పిందె దశలో గల పత్తి పైరును రసం పీల్చే పురుగు, లద్దె పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకులు బానోత్ ప్రసాద్ సూచించారు. స్థానిక వ్యవసాయ అధికారి అత్తె సుధాకర్‌తో కలిసి శుక్రవారం భీమారం మండలం దాంపూర్ శివారులో పత్తి పంట క్షేత్రాలను సంధర్శించారు. ఏపుగా పెరిగిన పత్తి పైరులో పొగాకు లద్దె పురుగు, రసం పీల్చే పరుగును గుర్తించిన ఆయన నివారణ కోసం తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. రసం పీల్చే పురుగు నివారణకు డైనోటేపురాన్‌తో డైపెన్తూరాన్ 80(జీ) లేదంటే ఫ్లోనిసమిడ్(జీ) ఎకరాకు కలిపి పిచికారి చేయాలని సూచించారు. అదేవిధంగా నోవాలయురన్ 200 ఎంఎల్ లేదంటే ఫుబెండామెడ్ 50(జీ) 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయడం ద్వారా పొగాకు లద్దె పురుగు నివారించవచ్చునని తెలిపారు. అదేవిధంగా వరి పంట క్షేత్రాలను సందర్శించిన ఆయన వరి పైరులో పాము పొడ తెగులు గుర్తించినట్లు తెలిపారు. పాము పొడ తెగులు నివారణకు హెక్సాకోనజ్ 400(జీ) ఎకరాకు పిచికారి చేయాలని, సుడిదోమ ఆశించిన సందర్భంలో పైమెట్రోజైన్(జీ) లేదంటే డైనోప్యూరాన్(జీ) 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయడం ద్వార సుడి దోమ నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమారం ఏఈఓ బొల్లంపల్లి అరుణ్ కుమార్, రైతు నీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన సిరినేని రాహుల్ ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా మండల పద్మశాలి సంఘం ఆద్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో రాహుల్‌ను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండల అధ్యయక్షుడు చెట్టుపల్లి గంగయ్య మాట్లాడుతూ రాహుల్ ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్‌గా పేద ప్రజలకు సేవలు అందించాలన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో రాహుల్ తల్లిదండ్రులు శివసాగర్, కళావతి, పద్మశాలి సంఘం మండల నాయకులు చెటుపల్లి సత్యం, అయ్యోరి వీరయ్య, దశరథం, దోమల బాస్కర్, చెటుపల్లి కృష్ణ, వాసాల శ్రీనివాస్, వాసాల మహేష్, సిరిపురం రామన్న, మాటేటి కొమురయ్య, చెటుపల్లి లచ్చన్న, అయ్యోరి సత్యన్న, పోతు శ్రీను, సంబారి శంకరయ్య, గౌడ అంజన్న పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ, ఎమ్మెల్యే బాల్క సుమన్ జన్మదినం

నవతెలంగాణ-జైపూర్



పెద్దపల్లి మాజీ పార్లమెంట్ సభ్యులు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు రిక్కుల మధూకర్‌రెడ్డి, మేడి తిరుపతి, మద్దుల సాగర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు జాడి ఏసయ్య, అర్నె సమ్మయ్యల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల చెందిన బీఆర్ఎస్ నాయకులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన వ్యవసాయ అధికారి

నవతెలంగాణ-జైపూర్

మండలం వ్యవసాయ అధికారిగా అత్తే సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు (తాడిచర్ల) మండల వ్యవసాయ అధికారిగా పనిచేసిన ఆయన బదిలీపై వచ్చారు. ఉమ్మడి జైపూర్ మండలంలో వ్యవసాయ విస్తీర్ణాధికారిగా విధులు నిర్వర్తించిన సుధాకర్ వ్యవసాయ అధికారిగా ఉద్యోగోన్నతి పొందిన ఆయన జిల్లా వ్యవసాయ కార్యాలయంలో పనిచేశారు.

పెండింగ్ స్కాలర్షిప్ నిధులను విడుదల చేయాలి

- ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్

నవతెలంగాణ-తాండూర్



పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్మెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ కోరారు. శుక్రవారం బెల్లంపల్లి తిలక్ స్టేడియం-1 గ్రౌండ్ నుంచి కాంటా చౌరస్తా వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం దాదాపు రూ.7వేల కోట్ల పైచిలుకు స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు .స్కాలర్ షిప్‌ను ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, విద్యాసంస్థలు నానా ఇబ్బందును ఎదుర్కొంటున్నాయని తెలిపారు. విద్యాశాఖ మంత్రి లేక విద్యా వ్యవస్థ కుంటు పడుతుందని ఆరోపించారు. విద్యాసంస్థలు కళాశాలలు నడుపలేక, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక కళాశాలల యాజమాన్యాలు నాన్న అవస్థలు పడుతున్నాయని తెలిపారు. కళాశాలలు మూసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. పరోక్షంగా వేలాదిమంది నిరుద్యోగులు కళాశాలలలో పనిచేస్తున్నారని, మూసివేత వల్ల ప్రయివేట్ పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులు రోడ్డున పడతారని తెలిపారు. టోకెన్ ఎమౌంట్ కాకుండా పూర్తి బకాయిలు వెంటనే విడుదల చేయాలని,లేని యెడల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీల ఇండ్లతో పాటు అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ర్యాలీలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి పసులేటి వెంకటేష్, ఎస్పిపి జిల్లా అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ ఉద్యమకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ ఓయూ ఆర్ట్స్ కాళాశాల వరకు పచేపట్టి పాదయాత్ర మండలంలోని కలమడుగు గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా వారికి సీపీఐ(ఎం) మండల నాయకులు స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యమంలో ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారన్నారు. అరెస్టులు, లాఠీ చార్జీలు, దాడులు, జైలు జీవితాలు అన్నింటిని ఎదిరించి కొట్లాడి ప్రత్యేక రాష్టం సాధించుకున్నామన్నారు. ఫలితంగా 10 సంవత్సరాల పాటు కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలించి ఉద్యమకారులకు మొండి చేయి చూపారన్నారు. అందరికీ న్యాయం చేస్తాడని రెండుసార్లు అధికారం ఇచ్చామని అన్నారు. ఆయన పాలనలో కుటుబానికి లాబం చేకూరింది తప్ప ఉద్యమకారులకు ఎలాంటి గుర్తింపు ఇవ్వలేదని విమర్శించారు. ప్రశ్నించిన వారిని నిలదీసిన వారిని, నిర్బంధించి నిండా ముంచిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఇస్తే కాంగ్రెస్‌కు మద్దతిస్తామని కాంగ్రెస్ సోనియా గాంధీని నమ్మించి మోసగించారని గుర్తు చేశారు. ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తామని తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రకటించిందని, ఇప్పటివరకు 11 నెలలు గడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ పాదయాత్ర మొదలు పెట్టామన్నారు. పాదయాత్రకు మద్దతు తెలిపిన సీపీఐ(ఎం) నాయకులు కె బుచ్చయ్య, కొండగుర్ల లింగన్న, అంబటి లక్ష్మణ్, ఎస్‌కే అబ్దుల్లాకు ధన్యవాదాలు తెలిపారు.

మాలగురిజాలలో పత్తి పంటల పరిశీలన

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి మండలంలోని మాల గురజాలలో కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి నాగపూర్ జాతీయ పత్తి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు శుక్రవారం అధిక సాంద్రత పత్తి పంటలను పరిశీలించారు. పత్తి పంటలో దిగుబడులను అంచనా వేశారు. పత్తి పంటలో ఎదుర్కొన్న చీడపీడల సమస్యలు పెట్టుబడి ఖర్చులను గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. కోట శివకృష్ణ మాట్లాడుతూ బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, నాగపూర్ జాతీయ ప్రత్తి పరిశోధనా సంస్థ, ఆధ్వర్యంలో సంయుక్తంగా జాతీయ ఆహార భద్రత మిషన్ కింద ఉత్తమ పద్ధతుల ద్వారా పత్తి పంటలో ఉత్పాదక ఖర్చులు తగ్గించి మంచి దిగుబడులు సాధించేలా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 425 ఎకరాలలో రైతు క్షేత్రాలలో ప్రదర్శనలను నిర్వహిస్తున్నామన్నారు. బెల్లంపల్లి మండల పరిధిలోని మాలగురిజాల గ్రామంలో అధిక సాంద్రత పద్దతిలో పత్తి సాగుచేస్తున్న దుర్గం సుమన్, కలాలి సంతోష్ పత్తి సాగు చేస్తున్న ఇతర రైతు క్షేత్రాలలో పర్యటించి రైతు అనుభవాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీఐసీఆర్ శాస్త్రవేత్త సునీల్ మహాజన్, కృషి విజ్ఞాన కేంద్రం, శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, రాశి సీడ్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఫీల్డ్ స్టాఫ్ సంతోష్, ప్రొఫెషనల్స్ ప్రియాంక, శైలజ, అనిల్ పాల్గొన్నారు.

నేషనల్ ఎడ్యుకేషన్ బ్రిలియన్స్ అవార్డుకు ఎంపిక

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ నేషనల్ ఎడ్యుకేషన్ బ్రిలియన్స్ అవార్డు దక్కింది. జాడి ప్రవీణ్ తెలంగాణ మోడల్ స్కూల్ కాసిపేటలో టీజీటీ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ప్రవీణ్ ఆసిఫాబాద్ ఆదర్శ పాఠశాలలో 10 సంవత్సరాలు పని చేసి ఇటీవలే కాసిపేట మోడల్ స్కూకు బదిలీపై వచ్చారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి చాలా సైన్స్ ప్రాజెక్టులు ఆవిష్కరణలు చేశారు. అలా ఎన్నో ప్రాజెక్టులు తెలంగాణ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం జరిగింది. భారతదేశంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన 10 మంది ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం ఈ అవార్డును అందజేస్తారు. దేశవ్యాప్తంగా వచ్చిన వివిధ నామినేషన్ల నుండి జాడి ప్రవీణ్ పేరు టాప్ 10లో ఖరారు చేశారు. ఈసారి తెలంగాణ రాష్ట్రం నుంచి సైన్సు ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ ఎంపిక అయ్యాడు. అతని పేరును కమిటీ, ప్యానెల్ సభ్యులు ప్రతిష్టాత్మక 2024 జాతీయ విద్యా ప్రతిభ అవార్డుకు ఎంపిక చేశారు. విద్యారంగంలో ఆయన సాధించిన అద్భుతమైన విజయాలకు ఈ అవార్డును ప్రకటించారు. నేషనల్ ఎడ్యుకేషన్ బ్రిలియన్స్ అవార్డు వేడుక ఎన్జీఓ సంస్థ అయినా హైపెడ్జ్ గ్రూప్, ఎడ్యుకేషన్ కనెక్ట్ ఫ్లేస్ సంయుక్తంగా న్యూఢిల్లీలోని హోటల్ రాడిసన్ బ్లులో శుక్రవారం నిర్వహించగా అవార్డు స్వీకరణ కార్యక్రమానికి కొన్ని కారణాలతో హాజరు కాలేకపోయారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపిక కావడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ అభినందించారు.

రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలి

నవతెలంగాణ-తాండూర్



ప్రభుత్వం రైతు భరోసా డబ్బులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర రైతు సంఘం మంచిర్యాల జిల్లా కార్యదర్శి కొండుబానేష్ కోరారు. శుక్రవారం బెల్లంపల్లి మండలం చాకపల్లి గ్రామంలో రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. బానేష్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ దాటిపోయి మూడు నెలలు గడుస్తున్న ప్రభుత్వం రైతుబంధు జమ చేయలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే రైతులందరికీ ఎకరాకు రూ.7500 జమ చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకుంటే రైతులతో కలిసి ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం బెల్లంపల్లి మండల ఉపాధ్యక్షులు చదువుల దుర్గమ్మ, కోండు సాయి కుమార్, ఠాకూర్ శ్యామ్ సింగ్, ఉప్పరి స్వామి, చదువుల పోచయ్య, మేకార్తి మల్లక్క, జక్కం కమల, చదువుల భీమక్క, కోట్ల రాజేశ్వరి, పంబాల పోశక్క, కుందేళ్ళ సుప్రియ, అప్పరి రాజక్క, పోతరవేని లక్ష్మి కాంత్, ఎటకార్ల శంకరమ్మ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం మానసిక ఆరోగ్యంపై మానసిక నిపుణులు డా.సునీల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉంటేనే మానసిక శక్తి దృఢంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. పరీక్షా సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో నిబద్ధతతో రాయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కరుణాకర్, అధ్యాపకులు బాపురవీందర్, మోహన్, దేవేందర్, సాయికుమార్, కుమారస్వామి, శశికళ, స్వరూప పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ జైపూర్

జైపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా శనివారం జైపూర్ మండలంతో పాటు భీమారం మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 వరకు సబ్‌స్టేషన్ మరమ్మత్తులు కొనసాగనున్నాయని తెలిపారు. ఫలితంగా జైపూర్ సబ్‌స్టేషన్ పరిధి వెంకట్రావుపల్లి, ఎలుకంటి, దుబ్బపల్లి, నర్వ, రసూల్ పల్లి, మిట్టపల్లి, ముదిగుంట, కానుకూరు, గంగిపల్లి, పెగడపల్లి గ్రామాల వారికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారుల సహకరించాలని కోరారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా అందిస్తుంది సేవలు సద్వినియం చేసుకోవాలని ఆ బ్యాంకు కుందారం శాఖ మేనేజర్ సుధీర్ కుమార్ సూచించారు. జైపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాదారులు బ్యాంకు ద్వారా అమలు చేస్తున్న పథకాలు, సేవా సమాచారం పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు పాటించాలని, కొత్త నెంబర్ల ద్వారా వచ్చే సెల్ ఫోన్ కాల్స్, మెసేజ్ జాగ్రత్తగా పరిశీలించాలని, ఈ విషయంలో ఖాతాదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. బ్యాంకు ద్వారా ప్రయోజనం పొందిన ఖాతాదారులు సకాలంలో స్పందించి చెల్లింపుల్లో జాప్యం జరగకుండా వ్యవహరించాలని కోరారు. అదేవిధంగా బీమా పథకాలను సద్వినియోగం చేసుకొని కుటుంబ భద్రత ప్రయోజనాల పొందాలని కోరారు. ఈ సమావేశంలో క్యాషియర్ హేమా సుందర్, తిరుపతి, పాల్గొన్నారు.

రేపు సాలేగూడలో కుమురంభీం వర్ధంతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సాలేగూడ గ్రామంలో ఈ నెల 20న ఆదివాసీ ముద్దు బిడ్డ కుంరంభీం వర్ధంతిని శుక్రవారం ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ యూత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిడం గణపతి, పెందూర్ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు మోతిరాం, సలహాదారు మడావి మాణిక్ రావు, శేఖర్, సిడం జైతు పటేల్, కుడ్మెత జలపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల ఆదివాసీ ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి, యువజన, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తరలి వచ్చి నివాళ్లర్పించారని తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలి



నవతెలంగాణ-జైపూర్

మండల కేంద్రంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ సూచించారు. స్థానిక ఎంపీఓ శ్రీపతి బాపురావుతో కలిసి శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను సంధర్శించిన ఆయన పాఠశాలలో కొనసాగుతున్న పనులు పరిశీలించారు. ఈ నెల 20న మండలలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్య పునులు నిరంతరం కొనసాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలీస్ మాధూర్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

వారసంతలో సంచులు పంపిణీ

నవతెలంగాణ-సారంగాపూర్



మండల కేంద్రంలో శుక్రవారం వారసంతలో ఎంపీఓ అజీజ్‌ఖాన్ బట్ట సంచులు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్లు వాడకుండా వస్త్రంతో తయారు చేసిన సంచులను వాడలని అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడటం వల్లే కలిగే అనర్థాలను వివరించారు. మండలాన్ని ప్లాస్టిక్ రహిత మండలంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపికృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నిర్మల్ పట్టణంలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని 33/11 కేవీ ఆదర్శనగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల దృష్ట్యా ఆదర్శనగర్, రామ్‌నగర్, గాయత్రీపురం, ఆశ్ర కాలనీ, ఈద్గామ్, భాగ్యనగర్, ఫిష్ మార్కెట్, సిద్ధాపూర్, ఇందిరమ్మ కాలనీ, సోఫీనగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

లోకేశ్వరం : మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా లోకేశ్వరం, పిప్రి సబ్ స్టేషన్ పరిధిలో మధ్యహ్నం ఒంటి గంట నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆదిలాబాద్ ప్రకృతి సహజ అందాలకు నిలయం

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఆదిలాబాద్ జిల్లా ప్రకృతి సహజ అందాలకు నిలయమని, పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఇవి మరింత ప్రాచుర్యంలోకి వస్తాయని, జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని టూరిజమ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం టీటీడీసీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ జిల్లాలోని అందమైన ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాలపై ఏర్పాటు చేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. పలువురు ఫోటోగ్రాఫర్లు తీసిన పర్యాటక అందాలను ప్రదర్శించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వీటిని తిలకించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించగా, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.

జిల్లాలో చూడదగ్గ ప్రదేశాలకు కొదవలేదు...

ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రకృతి నిలయమైన ఆదిలాబాద్ జిల్లాలో చూడదగ్గ ప్రదేశాలకు కొదువ లేదన్నారు. వాటి గురించి తెలియజెప్పాలనే ఉద్యేశంతో విద్యార్థులతో కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఒక ఛాయా చిత్రంలో వేల భావాలు నిగూఢమై ఉంటాయన్నారు. వాటిని ఆత్మావలోకనం చేసుకుంటూ, అందులోని గొప్పతనాన్ని గుర్తించాలని సూచించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి టూరిజమ్ శాఖ కృషి చేస్తోందని, వెలుగులోకి రాని ప్రకృతి సోయగాల గురించి బయటి ప్రపంచానికి తెలిసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఈఓ ప్రణీత, టూరిజం అధికారి రవికుమార్, డీపీఆర్‌ఓ తిరుమల పాల్గొన్నారు.





ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన



నవతెలంగాణ-ఉట్నూర్

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం దుర్వినియోగం కాకుండా గ్రామస్థాయిలో అవగాహన పెంచాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ డివిజన్ స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రజలకు చట్టంపై అవగాహన పెంచాలన్నారు. అట్రాసిటీ కేసు నమోదు అయినప్పుడు బాధిత కుటుంబానికి నిజంగా అన్యాయం జరిగినప్పుడు సత్వర న్యాయం చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణాలలో, వ్యాపారుల వద్ద కొందరు స్వార్థపరులు స్వలాభం కోసం ఎస్సీ ఎస్టీ చట్టాన్ని అడ్డం పెట్టుకొని బెదిరింపులకు గురి చేసే వారిని అరికట్టాలని సూచించారు. ఎవరికి అన్యాయం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్ర, ఆర్డీఓ, తహసీల్ధార్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కులవృత్తుల ద్వారా స్వయం ఉపాధి రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజనను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ పిలుపునిచ్చారు. ఈ పథకం కింది దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్దిదారులకు యూనిట్లు మంజూరు కాగా, అందుకు సంబంధించిన పత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే పాయల శంకర్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం ఉపాధి పొందాలనుకునే కులవృత్తుల వారికి పీఎం విశ్వకర్మ యోజన మంచి వరమని అన్నారు. గతంలో బ్యాంకుల నుంచి రుణం పొందడం ఇబ్బందిగా ఉండేదని, బ్యాంకర్లు అడిగే షూరిటీలు ఇవ్వడం సాధ్యమయ్యేది కాదన్నారు. ఈ పథకం పూర్తి పారదర్శకంగా ఉంటుందని, మధ్య దళారుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి నేరుగా లబ్ది చేకూరుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం, పట్టణ ప్రాంతాల్లో 25 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఔత్సాహికులైన యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పాలనుకునే ఔత్సాహికులకు అవసరమైన సహకారం అందిస్తామని, పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్‌రాజ్ తెలిపారు. సోమ, గురువారాల్లో తమ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రఘుపతి, భరత్, ఆకుల ప్రవీణ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు లాలా మున్నా, ముకుంద్, అనిల్ పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలి

నవతెలంగాణ-నిర్మల్



నూతన పరిశ్రమల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. టీఎస్ ఐపాస్ వెబ్ సైట్‌లో నూతన పరిశ్రమల కోసం వచ్చిన దరఖాస్తులకు అనుమతుల జారీ విషయంలో పారదర్శకంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులు, అనుమతి, తిరస్కరణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నియమాలు పాటించిన వారికి మాత్రమే పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పించాలన్నారు. సంబంధిత అన్ని ధ్రువపత్రాలు జాగ్రత్తగా సరిచూడాలన్నారు. ఒకవేళ దరఖాస్తును తిరస్కరించినట్లయితే వాటికి గల కారణాలను దరఖాస్తు ఫారంలో పొందుపరుచలన్నారు. పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల నుంచి దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ మండల కార్యాలయాల్లో ఈ పథకంపై అవగాహన కలిగేలా సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకానికి సంబంధించిన మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ నరసింహారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

వాహనాల పంపిణీకి లబ్దిదారుల ఎంపిక

నవతెలంగాణ-నిర్మల్

రిట్రోఫిటెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీకి లబ్దిదారుల ఎంపికను శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలోని జిల్లా స్క్రీనింగ్ కమిటీ, అర్హులైన వికలాంగులకు రిట్రోఫిటెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీకి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టారు. అధికారులు లబ్ధిదారుల ఎంపికకు హాజరైన వికలాంగుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా రాజేందర్, డీఆర్డీఓ విజయలక్ష్మి, ప్రాంతీయ రవాణా అధికారి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అభివృద్ధికి కృషి

● వీసీ గోవర్ధన్

నవతెలంగాణ-ముధోల్



ట్రిపుల్ ఐటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తానని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. వీసీగా భాద్యతలు చేపట్టిన రెండో రోజు శుక్రవారం బాసర ట్రిపుల్ ఐటీ ప్రాంగణానికి వీసీ రావటంతో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ట్రిపుల్ ఐటీ పరిపాలన భవనంలో గల వీసీ చాంబర్‌లో విశ్వవిద్యాలయ స్థితిగతుల గురించి వీసీ సమీక్షించారు. అనంతరం విద్యార్థుల భోజనశాలను పరిశీలించారు. డైనింగ్ హాల్, కిచెన్, స్టోర్ రూమ్స్‌లను తనిఖీ చేశారు. పరిశుభ్రత, నాణ్యమైన వస్తువుల వాడకం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి వీసీ భోజనం చేశారు. ఆ తర్వాత పరిపాలన భవనంలో అసోసియేట్ డీన్స్, అకాడమిక్స్ స్టూడెంట్ వెల్ఫేర్ అధికారులతో, సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయంలో అందిస్తున్న కోర్సుల వివరాలు, అకాడమిక్ క్యాలెండర్, వసతి గృహాల వివరాలు, విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న సేవలు తదితర అంశాలను అధికారులు వీసీకీ వివరించారు. సాంకేతిక విద్యతో పాటు క్రీడా సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు. నాణ్యమైన విద్యను, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు అవసరమైన నూతన కోర్సులను ఏర్పాటుకు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం పట్ల అన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పెండింగ్ పనులు ఉంటే ప్రభుత్వంతో సంప్రదించి పూర్తి చేస్తామని తెలిపారు. పరిపాలన భవనంలో గల వివిధ పరిపాలన విభాగాలను పరిశీలించారు. ఫైనాన్స్, స్కాలర్‌షిప్, అకాడమిక్, స్టూడెంట్ వెల్ఫేర్, లైబ్రరీ, ప్లేస్‌మెంట్ తదితర విభాగాలను పర్యవేక్షించి, వాటి పనితీరును గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ విభాగాల అధికారులు, వీసీని కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేటెడ్ డీన్స్, పీఆర్‌ఓ పాల్గొన్నారు.

శక్తి అభియాన్ జాతీయ సమావేశంలో ఆత్రం సుగుణ



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ అధ్యక్షతన శుక్రవారం ఢిల్లీలోని జవహర్ భవన్‌లో శక్తి అభియాన్ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ, ఇందిరా ఫెలోషిప్ ఉమ్మడి జిల్లా యూనిట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఇందిరా ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ మహిళలకు సాధికారత కల్పించడం, రాజకీయాల్లో వారికి సరైన ప్రాతినిధ్యం కల్పించడం, సమానత్వం, మార్పు వైపు మార్గం సుగమం చేయడం లక్ష్యంగా భారతీయ యువజన కాంగ్రెస్ నేతృత్వంలోని శక్తి అభియాన్ ఇందిరా ఫెలోషిప్ పని చేస్తుందని తెలిపారు. సంవత్సరం కింద మేము రాజకీయాల్లో మహిళల గొంతులను పెంపొందించే లక్ష్యంతో ఇందిరా ఫెలోషిప్‌ని ప్రారంభించామని తెలిపారు. నిజమైన మార్పును సృష్టించాలనే ఉద్దేశంతో ఉన్న మహిళలు శక్తి అభియాన్‌లో చేరాలని కోరారు.

మాదిగల అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షునిగా అడ్డిగ లక్ష్మణ్

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



మాదిగల అంబేద్కర్ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షునిగా నిర్మల్‌రూరల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన అడ్డిగ లక్ష్మణ్‌ను నియమిస్తూ, శుక్రవారం మాదిగల అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నిగులపు లింగన్న నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

మీ సేవలు అభినందనీయం



నవతెలంగాణ-సిరికొండ

● బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయునికి సాంప్రదాయ వీడ్కోలు



ఉపాధ్యాయునిగా మీ సేవలు అభినందనీయమని, విద్యార్థులకు అందించిన బోధన మరువలేమని సత్మోరిగూడ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు అన్నారు. శుక్రవారం మండలంలోని సత్మోరిగూడ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసిన మునేశ్వర్ విజయ్‌కుమార్ బదిలీపై సిరికొండ పాఠశాలకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ముందుగా సాంప్రదాయ బద్ధంగా తమ కుల దేవునికి పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పటేల్ భీంరావ్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ తమ పిల్లలను ఎంతో ప్రేమతో దగ్గర తీసుకొని, వారికి అక్షరాలు నేర్పించారని అన్నారు. మళ్లీ మా ఊరికి రావాలని కోరారు. సిరికొండ ఎంఈఓ సునీల్ మాట్లాడుతూ విజయ్‌కుమార్ హెచ్‌ఎంగా సత్మోరిగూడ బాధ్యతలు తీసుకున్నా తరువాత పాఠశాలను ఒక గుడిలా మార్చారని అన్నారు. విద్యార్థులు, గ్రామస్తులు ప్రధానోపాధ్యాయునిపై ఇంతటి ప్రేమా అభిమానం సంపాధించుకున్నారని అన్నారు. విద్యార్థులు తమను వదిలి వెళ్లోద్దని ఉపాధ్యాయున్ని హత్తుకొని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం గ్రామస్తులందరికి గ్రామ పటేల్ భీంరావ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ ఎంఈఓ ఉదయ్‌రావు, హెచ్‌ఎంలు సంజీవ్, సూర్యప్రకాష్, గంగారాం, రమేష్, సుమన్, అనంద్‌రావు, కావ్య, గ్రామ మహజన్ పెందూర్ ఈశ్వర్, దేవరి ఆత్రం మారుతి, గ్రామస్తులు సీడం సురేష్, సుదర్శన్, కనక ప్రసాద్, శంకర్, నైతం కైలాస్, నైతం శంకర్, మడావి సంతోష్ పాల్గొన్నారు.

గౌడన్నల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గౌడన్నల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఖానాపూర్ క్యాంపు కార్యాలయంలో 100 మంది గౌడన్నలకు వృత్తి పని ముట్లను రాష్ట్ర మత్స్యశాఖ చైర్మెన్ మెట్టు సాయి కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల అభివృద్ధికి పాటు పడుతుందన్నారు. గౌడన్నలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. విదేశాలలో మరణించిన గల్ఫ్ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గల్ఫ్ బాధితులను పట్టించుకోలేదని అన్నారు. కానీ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పేదల సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గౌడన్నలు, గల్ఫ్ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

వేదం గ్లోబల్ స్కూల్‌కు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని చిన్నోళ్ల ప్రశస్తిని 'ఇండియా ఈస్ ఆస్' స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన భారతదేశపు ప్రీమియర్ క్రియేటివిటీ నేషనల్ అండ్ ఇంటర్ స్కూల్ పెయింటింగ్, రైటింగ్ పోటీల్లో భాగంగా పవిత్ర స్వేచ్ఛ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జాతీయస్థాయిలో మూడవ స్థానంలో నిలచింది. ఈ సందర్భంగా శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థిని చిన్నోళ్ల ప్రశస్తి జాతీయస్థాయిలో మూడవ స్థానంలో నిలవడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థినికి, ఆమెను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భూపాల్ రెడ్డి, ప్రవళికరెడ్డి పాల్గొన్నారు.